సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023

I



ఆరోగ్య 'సిరి'
విద్యార్థులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సెమినార్ నిర్వహిస్తున్నారు. -IIలో..



సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం
సమస్యలను సత్వరం పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యమని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. -IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
34.2/25.9

వాతావరణం
జిల్లాలో బుధవారం 25.9 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో రెండో రోజూ వర్షం

కడప ఎడ్యుకేషన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండో రోజు మంగళవారం కూడా వర్షం కురిసింది. మైదుకూరులో అత్యధికంగా 26 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాపాడులో 20, ఖాజీపేట 8.4, చెన్నూరు 5, వల్లూరు 4.8, దువ్వూరు 2.2, రాజుపాళెంలో 0.8 మి.మీ. వర్షం కురిసింది.

24న బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగర పరిధి ఊటుకూరులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్.సహదేవరెడ్డి తెలిపారు. ఈనెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో 9వ సీనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరు కావాలని ఆయన వివరించారు.

'నంది' పోటీలకు కడప నాటకం

కడప కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నంది నాటక పోటీలకు మన జిల్లాకు చెందిన నాటకం ఎంపికైంది. పౌరాణిక నాటక విభాగంలో కడప నగరానికి చెందిన సీనియర్ నాటక సంస్థ, ఇప్పటికే పలు నంది బహుమతులను కైవసం చేసుకున్న సవేరా ఆర్ట్స్ రూపొందించిన నాటకం శ్రీరామ పాదుకలు పోటీలకు ఎంపికైంది. ఇటీవల రాష్ట్ర నంది నాటక ఎంపిక కమిటీ ప్రొద్దుటూరును సందర్శించిన సందర్భంగా సవేరా నాటక సంస్థ తమ నాటకాన్ని వారి ఎదుట ప్రదర్శించింది. మరో రెండు పౌరాణిక నాటకాలు కూడా జిల్లా నుంచి పోటీలో పాల్గొన్నాయి. వీటిలో సవేరా వారి శ్రీరామ పాదుకలు నాటకం ఎంపికైనట్లు సమాచారం. ప్రముఖ నాటక రచయిత పల్లెటి లక్ష్మీకులశేఖర్ రచించిన ఈ నాటకానికి సంస్థ నిర్వాహకులు ఆళ్లారి వెంకటయ్య దర్శకత్వం వహిస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలో జిల్లాకు చెందిన పౌరాణిక నాటకం ఎంపిక కావడం పట్ల ఇతర నాటక సంస్థలు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుది పోటీలు నవంబరులో ఉంటాయి.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్, సైన్స్‌బ్లాక్, కామర్స్, మేనేజ్‌మెంట్ బ్లాక్‌లలో నిర్వహిస్తున్న పోస్టుగాడ్యుయేషన్ సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం పరీక్షల్లో సంస్కరణలు తీసుకొచ్చిందని, వికేంద్రీకరణ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. తద్వారా ఫలితాలు త్వరగా విడుదలై విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. తొలిరోజు రెండవ సెమిస్టర్ నాన్ కోర్ పరీక్ష జరిగిందన్నారు. రేపటి నుంచి నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. మరోవైపు విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

స్టాఫ్‌నర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ తెలిపారు. జోన్-4 పరిధిలో మొత్తం 94 పోస్టులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. పూరించిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లో గల వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలను ఆ వెబ్ సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫెరీ/బీఎస్సీ (నర్సింగ్) విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ఉపాధి..ఉన్నతి



ఈ ఫొటోలోని యువకుడు గోపవరం మండలం టి.సంద్రపల్లెకు చెందిన చిన్నయ్య. ఇతని తండ్రి ఉపాధి హామీ కూలీ. వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్నాడు. దీంతో చిన్నయ్యకు ఉన్నతి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చారు. తర్వాత చెన్నైలోని మెడిప్లస్‌లో ఉద్యోగం వచ్చింది. రూ.22,500 వేతనం అందుతోంది.



ఈ చిత్రంలోని యువకుడి పేరు బాల గంగాధర్‌రెడ్డి. రాజుపాళెం మండలం అర్కటవేముల గ్రామం. ఇతని కుటుంబ సభ్యుడు వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్నాడు. దీంతో బాల గంగాధర్‌రెడ్డి ఉన్నతి కార్యక్రమం ద్వారా శిక్షణ పొందాడు. ప్రాంగణ ఎంపికల్లో చెన్నైలోని మెడ్‌ప్లస్ కంపెనీకి ఎంపికయ్యాడు. ప్రస్తుతం వేతనం రూ.24,500 వస్తోంది.

ఇలా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 65 మంది యువకులు శిక్షణ తీసుకుని ఉద్యోగం, ఉపాధి పొందారు. కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. పర్యవసానంగా ఉపాధి హామీ కూలీలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు.

- కూలీల కుటుంబాలకు మెరుగైన జీవనోపాధి
- 100 రోజుల పని పూర్తి చేసిన వారి పిల్లలకు శిక్షణ
- ఉద్యోగ అవకాశాల కల్పన
- ఉచితంగా వసతి, సదుపాయాలు



కడపలో ఉన్నతి కార్యక్రమం ద్వారా శిక్షణ పొందుతున్న యువత

కడప సిటీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు ప్రభుత్వం పనులు కల్పించి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అంతే కాకుండా వంద రోజులు పని పూర్తి చేసుకున్న కూలీల బిడ్డలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఉపాధి హామీ కూలీల కుటుంబాల శ్రేయస్సే లక్ష్యంగా పని చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అర్హులైన నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారు. కడప కేంద్రంగా టీటీడీసీ (టెక్నికల్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్) ద్వారా జిల్లా సమాఖ్య శిక్షణ ఇస్తోంది. మరొక శిక్షణ కేంద్రం నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ కూడా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ప్రస్తుతం అర్హులైన ఎంత మందికైనా శిక్షణ ఇచ్చే పరిస్థితి కల్పించారు. ఇప్పటికే సంబంధిత సిబ్బంది అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చేందుకు ఎంపికలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ ఏడాది దాదాపు 60 మందికి పైగా ఎంపిక కాగా, ప్రస్తుతం టీటీడీసీలో 35 మందికి శిక్షణ ఇస్తున్నారు. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా మరో 35 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.

గతేడాది ఇలా..
2021-22 ఆర్థిక సంవత్సరంలో 65 మందికి శిక్షణ ఇవ్వగా 52 మంది ప్లేస్‌మెంట్ సాధించి ఉపాధి పొందుతున్నారు. మిగతా 13 మంది దూర ప్రాంతాలకు వెళ్లలేక.. స్థానికంగానే ఉంటూ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాలు
2018 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల్లో అందులో ఏ ఏడాదైనా వంద రోజులు పని పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కూలీల కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. 2018-19లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 43059 కుటుంబాలు, 2019-20లో 17874 కుటుంబాలు, 2020-21లో 21,893 కుటుంబాలు, 2021-22లో 17100 కుటుంబాలు, 2022-23లో 9717 కుటుంబాలు, 2023-24లో 4830 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం ఇలా..
2023-24 సంవత్సరంలో 31.12.2023 వరకు 210 మందికి ఉన్నతి స్కీమ్ కింద, 2018-19, 2019-20, 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో జిల్లాలో 100 రోజుల ఉపాధి పని దినాలను పూర్తి చేసుకున్న కుటుంబాల్లో నిరుద్యోగ యువతకు వివిధ సాంకేతిక రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు.

- ఈ శిక్షణలన్నీ ప్రభుత్వం ద్వారా ఉచితంగా కల్పిస్తారు. అలాగే శిక్షణ కాలంలో అభ్యర్థులకు భోజన వసతితోపాటు ట్రైనింగ్ మెటీరియల్ తదితర సదుపాయాలు ఉచితంగా అందజేస్తారు. శిక్షణానంతరం ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

కోర్సు	ట్రైనింగ్ సెంటర్ చిరునామా	అర్హతలు	కాంట్రాక్టు నంబరు
1. సేల్స్ సూపర్‌వైజర్	టీటీడీసీ, కడప	ఎస్ఎస్‌సీ	9866123414 (సీహెచ్ రంగస్వామి)
2. ఫీల్డ్ టెక్నిషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్	నిహార్ స్కిల్, కడప	ఎస్ఎస్‌సీ	9063082227 (సుబ్బరామిరెడ్డి)
3. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్	నిహార్ స్కిల్, కడప	ఇంటర్	90630822227 (సుబ్బరామిరెడ్డి)

డ్వామా, డీఆర్‌డీఏ భాగస్వామ్యంతో..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా-డీడబ్ల్యూఎంఏ), సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ (సీ-డ్యాప్) వారి ఆధ్వర్యంలో ఉన్నతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు నిరుద్యోగ యువతకు వివిధ సాంకేతిక రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతోంది. 2021-22 సంవత్సరంలో 65 మందికి వివిధ సాంకేతిక రంగాల్లో శిక్షణ ఇచ్చి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగింది. వీరందరూ ప్రస్తుతం రూ.20-25 వేల వరకు వేతనం అందుకుంటూ ఉద్యోగాలు చేస్తున్నారు.



అవకాశాన్ని వదులుకోవద్దు



ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అన్ని రకాలుగా మేలు చేస్తోంది. అందులో భాగంగానే ఈ కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగులు ఎంత మంది ఉన్నప్పటికీ అంత మందికి ఉన్నతి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోంది. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వదులుకోవద్దు. శిక్షణ పొంది ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుకోవాలి.
– పి.యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

శిక్షణలో ఉపాధి పొందాలి



జిల్లా కేంద్రంగా టీటీడీసీ, నిహార్ స్కిల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉన్నతి కార్యక్రమం ద్వారా నైపుణ్య శిక్షణను అందిస్తున్నాం. శిక్షణా కాలంలో వసతితోపాటు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. అర్హులైన ప్రతి నిరుద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడి కుటుంబానికి ఉపాధి కల్పించాలి.
– ఆనంద్ నాయక్, పీడీ, డీఆర్‌డీఏ, కడప

గంగ ఒడికి గణపతి

- వినాయకుడికి ఘనంగా వీడ్కోలు
- వైభవంగా నిమజ్జనం

కడప కల్చరల్ : బొజ్జ గణపతి.. సకల విద్యల విఘ్నేశ్వరుడు.. శివపార్వతుల ముద్దుల తనయుడు.. ఆదిపూజలస్వామి.. ఏకదంతుడు వినాయకుని నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. తల్లి గంగమ్మ ఒడికి తనయుడు గణపతిని చేర్చి మళ్లీ బాధ్రపద మాసంలో వచ్చి కటాక్షించాలని ప్రార్థించారు. సమీపంలోని నీటి వనరుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. స్వామిని పందిళ్లలో నుంచి వాహనాలపై చేర్చడానికి ముందు స్థానిక భక్తులకు అన్నదానాలు చేశారు.

- 'జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై.. గణపతి బొప్పమోరియా.. అనే నినాదాలు, తప్పెట వాద్యాలు, చెక్కభజనలు, బ్యాండుమేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కేరింతల మధ్య కట్టలు తెగిన ఉత్సాహం మధ్య గణపతి నిమజ్జనం జరిగింది. ఉదయం 10 గంటల నుంచి నగరంలో గణపతి విగ్రహాల నిమజ్జనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలుచోట్ల గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూల వేలం పాటలు, ఉట్టికొట్టడం, బాలలకు పోటీలను ఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.
- మూడు రోజులపాటు జిల్లా అంతటా పందిళ్లలో భక్తుల పూజలందుకున్న గణనాథుని విగ్రహాలను బుధవారం మధ్యాహ్నం నుంచి చెరువులు, కాలువలు, కుంటల్లో నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం విగ్రహాల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులకు అన్నదానాలు చేశారు. అనంతరం ట్రాక్టర్లు, లారీలు, మినీ క్యారేజ్ లారీలు, ఎడ్లబండ్లలో గణనాథులను ఊరేగింపు చేశారు. యువకులు, బాలలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకుంటూ విగ్రహం వెంట నిమజ్జనానికి వెళ్లారు. నగరానికి సమీపంలోని పాతకడప చెరువులో ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉన్నా కూడా ప్రత్యేకించిన పాయింట్లలో మాత్రమే పోలీసులు నిమజ్జనానికి అనుమతించారు.
- చెరువు గట్టుపై నిమజ్జనం ఘాట్లను ఏర్పాటు చేయడంతోపాటు సచివాలయం, మున్సిపాలిటీ సిబ్బంది పటిష్టమైన చర్యలు చేపట్టడంతో ఎలాంటి రద్దీ చోటుచేసుకోలేదు. దీంతోపాటు పది అడుగులు దాటిన పెద్ద విగ్రహాలను ఇర్కాన్ సర్కిల్‌లోని కేసీ కెనాల్, ఫాతిమా కళాశాల, వాటర్‌గండి, చెన్నూరు, సిద్దవటం ప్రాంతాలలో గల పెన్నానదిలో నిమజ్జనం చేశారు.



కడపలో.. ఉంటామయ్యా.. ఉండాల్లయ్యా..



కడపలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



దేవునికడప చెరువులో..



వీరపునాయునిపల్లెలో.. ఉత్సాహభరితం.. గ్రామోత్సవం

భారీ భద్రతా ఏర్పాట్లు



చెన్నూరు పీఎస్ పరిధిలో కేసీ కెనాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్/చెన్నూరు/సిద్దవటం : జిల్లాలో గణేశుని నిమజ్జన వేడుకల కోసం పోలీస్ యంత్రాంగం భారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కడప నగర శివారులోని పాత కడప చెరువు, సిద్దవటం సమీపంలోని పెన్నానది వంతెన, ఇర్కాన్ జంక్షన్ సమీపంలో కేసీ కెనాల్, చెన్నూరు పెన్నానది వంతెన వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులు, సిబ్బందిని, వినాయక విగ్రహ కమిటీల నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అపశ్రుతులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వెంట కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కె.అశోక్‌రెడ్డి, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, రిమ్స్ ఎస్ఐ నారాయణ, ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు, పోలీసు, అగ్నిమాపక, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైల్వేస్టేషన్ మేనేజర్ బాధ్యతల స్వీకరణ



శేఖర్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ మేనేజర్‌గా జాగర్లపూడి శేఖర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రైల్వేలో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా ఎర్రగుంట్ల, కొండాపురం, కడప, కమలాపురం, భాకరాపేటలో పని చేశారు. స్టేషన్ మేనేజర్‌గా కమలాపురం, నందలూరు, గంగాయపల్లెలో పని చేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలా తీర్చిదిద్ది ఆదర్శంగా ఉండేలా కృషి చేస్తానన్నారు. అనంతరం చీఫ్ కమర్షియల్ మేనేజర్ జనార్దన్‌తోపాటు పలువురు అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తల్‌సైనిక్ క్యాంపునకు ఎంపిక

కడప స్పోర్ట్స్: ఢిల్లీలో ఈ నెల 20న ప్రారంభమైన ఆలిండియా తల్‌సైనిక్ క్యాంపునకు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ ఇద్దరు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ పరిధిలో ఇటీవల అనంతపురంలో నిర్వహించిన తల్‌సైనిక్ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలకు చెందిన విద్యార్థులు జె.సంతోష్‌కుమార్ (ద్వితీయ బీకాం), ఎస్.ఉస్మాన్‌బాషా (ద్వితీయ బీఎస్సీ)లు ఆలిండియా తల్‌సైనిక్ క్యాంపునకు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్స్ తల్‌సైనిక్ క్యాంపునకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ ఆర్.నీలయ్య, మహేష్ సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఉత్సవంగా మొల్లమాంబ జయంతి

- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం

కడప కల్చరల్ : తొలి తెలుగు రామాయణ కవయిత్రి, వైఎస్సార్ జిల్లా ఆడబిడ్డ మొల్లమాంబ జయంతిని ఏటా రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీఓ నంబరు 99ను మంగళవారం విడుదల చేసింది. మొల్లమాంబ అభిమానులు, పలువురు కవులు, రచయితలు, కవయిత్రులు, కుమ్మర శాలివాహన సంఘం ప్రతినిధుల వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ముత్యాల రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా మొల్లమాంబ జయంతి సందర్భంగా మార్చి 13న ప్రత్యేకంగా ఉత్సవం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆ శాఖకు నిర్వహణ బాధ్యత అప్పగించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులకు ఈ వివరాలను పంపాలని సూచించారు. నిర్వహణలో వారి సహకారం తీసుకోవాలని సూచించారు. ఆతుకూరి మొల్లగా పేరుగాంచిన మొల్లమాంబ వైఎస్సార్ జిల్లా బద్వేలు వద్దగల గోపవరం గ్రామానికి చెందిన వారు. వాల్మీకి రామాయణాన్ని అతి తక్కువ పద్య, గద్యాలతో అత్యంత సులభమైన శైలిలో తనదైన ముద్రతో రచించి నాటి పండిత పామరుల ప్రశంసలు పొందారు. ఆమె జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నందుకు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నిమజ్జనానికి వెళ్లి యువకుడి మృతి


సునీల్‌ (ఫైల్‌)

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామంలో గణేశుని నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పామిడి సునీల్‌ (18) అనే యువకుడు నిమజ్జనం చేయక ముందే సునీల్‌ వరికుంట్ల చెరువులోకి దూకి పూడికలో ఇరుక్కుపోయాడు. ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో అక్కడే ఉన్న యువకులు 20 నిమిషాలు పోరాడి సునీల్‌ను బయటికి తీశారు. అప్పటికే యువకుడు మృతిచెందాడు.

అంతర్‌ రాష్ట్ర దొంగపై పీడీ యాక్టు


నిందితుడు నాగరాజుకు పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ వేణు

మడికొండ (హనుమకొండ జిల్లా): అంతర్‌ రాష్ట్ర దొంగపై పీడీ యాక్టు నమోదు చేస్తూ వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆ ఉత్తర్వులను దొంగతనం కేసులో అరెస్ట్‌ అయిన ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం వైఎస్సార్‌ జిల్లాకు చెందిన అంటగిరి రాజు అలియాస్‌ నాగరాజుకు బుధవారం చర్లపల్లి కారాగారంలో హనుమకొండ జిల్లా మడికొండ ఇన్‌స్పెక్టర్‌ వేణు అందజేశారు. పీడీ యాక్టు అందుకున్న నిందితుడు గత మార్చిలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడటంతో మడికొండ పోలీసులు గత నెల 10వ తేదీన అరెస్ట్‌ చేశారు. అతడి నుంచి సుమారు రూ.7లక్షల విలువ చేసే 103 గ్రాముల బంగారం, 824 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆరోగ్య సిరి

చిరుధాన్యాలను 'సిరి'ధాన్యాలు అని కూడా పిలుస్తారు.. వీటిని తీసుకుంటే ఆరోగ్యశ్రీమంతులుగా ఉండవచ్చు.. ఇవి ఎన్నో వ్యాధులకు దివ్యఔషధంలా పని చేస్తాయి.. కావున ప్రస్తుతం వీటి వైపు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.. ఈ మార్పు ఎంతో మంచిదని వైద్యులు సైతం చెబుతున్నారు.. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.

- చిరుధాన్యాలతో దరిచేరని రోగాలు
- పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన
- నేడు పులివెందులలో నేషనల్‌ సైన్స్‌ సెమినార్‌
- నేడు జిల్లా స్థాయి, 25న రాష్ట్ర స్థాయి సెమినార్‌



కడప ఎడ్యుకేషన్‌: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తినే ఆహారంపై అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయడానికి నేషనల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సైన్స్‌ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్‌ అండ్‌ టెక్నలాజికల్‌ మ్యూజియం బెంగళూరు వారు జాతీయస్థాయిలో నేషనల్‌ సైన్స్‌ సెమినార్‌–2023ను అక్టోబర్‌లో నిర్వహించనున్నారు. ఏటా ఒక్కో అంశంపై సెమినార్‌ నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం తెస్తున్నారు. కరోనా తరువాత నిర్వహించే ఈ సెమినార్‌లో 'మిల్లెట్స్‌ ఏ సూపర్‌ ఫుడ్‌ ఆర్‌ డైట్‌ ఫ్యాడ్‌' అంశానికి ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలతో ఆరోగ్యసిరి అందుతుందా.. లేక వ్యామోహంతో వాటిని తీసుకుంటున్నారా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా షుగర్‌, బీపీ వంటి వ్యాధుల బారిన అనేక మంది పడుతున్నారు. దీంతో చాలా మంది బియ్యాన్ని తగ్గించి చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనిపై విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సెమినార్‌ నిర్వహిస్తారు. దీని కోసం షెడ్యూల్‌ను ప్రకటించారు.



ఇలా చేయాలి

సెమినార్‌లో పాల్గొనే విద్యార్థులు చిరుధాన్యాల విశిష్టతను, వాటిలో ఉండే పోషకాలు, మినరల్స్‌, విటమిన్స్‌, ఏ వ్యాధులకు ఏ ధాన్యాలు తీసుకోవాలి వంటి విషయాలను వివరిస్తూ పోస్టర్స్‌, చార్ట్స్‌, పీపీటీ, స్లైడ్స్‌ రూపొందించి ప్రదర్శించాల్సి ఉంటుంది. ఒక్కో విద్యార్థి ఐదేసి పోస్టర్స్‌, చార్ట్స్‌, పీపీటీ, స్లైడ్స్‌లను తెలుగు, ఇంగ్లిష్‌ భాషల్లో రూపొందించాల్సి ఉంటుంది. వాటిలో ఉత్తమమైన వాటిని న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారు. వాటిని తయారు చేసిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అన్ని స్థాయిల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ కూడా చక్కటి ప్రతిభ కనబరిస్తే గోల్డ్‌మెడల్‌, నగదు బహుమతిని ప్రదానం చేస్తారు.

నేడు జిల్లా స్థాయి పోటీలు

పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటడానికి సమాయత్తం అవుతున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే సెమినార్‌లో పాల్గొనే ఔత్సాహికులకు సైన్స్‌ ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. చిరు ధాన్యాలతో ప్రయోజనాలు, ఆరోగ్య పరిరక్షణకు ఏ విధంగా దోహదం చేస్తాయనే విషయంపై శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి 21వ తేదీ గురువారం పులివెందులలోని జెడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో పులివెందుల ఫుడ్‌ టెక్నాలజీ కళాశాల నుంచి న్యాయ నిర్ణేతలు వచ్చి విద్యార్థుల ప్రతిభాపాటవాలను పరిశీలించి ఒక్కరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 25వ తేదీ విజయవాడలో రాష్ట్ర స్థాయి సెమినార్‌ నిర్వహించనున్నారు. అక్కడ విజేతలుగా నిలిచిన వారికి సీల్డ్‌తోపాటు ప్రశంసా పత్రాన్ని అందించి సన్మానించనున్నారు.

సెమినార్‌కు సమాయత్తం



నేషనల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సైన్స్‌ మ్యూజియం ఏటా ఒక్కో అంశంపై విద్యార్థులకు సెమినార్‌ నిర్వహిస్తుంది. ఈ ఏడాది చిరుధాన్యాలపై జాతీయస్థాయి సెమినార్‌ నిర్వహిస్తోంది. ఇప్పటికే షెడ్యూల్‌ ప్రకటించింది. దీంతో విద్యార్థులను సెమినార్‌కు సన్నద్ధం చేసేందుకు సైన్సు ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చాం. చిరుధాన్యాలపై సమస్త సమాచారాన్ని విద్యార్థులకు అందజేసి చక్కటి ప్రదర్శన ఇప్పిస్తున్నాం. వారు జాతీయస్థాయిలో రాణించడానికి శిక్షణ ఇస్తున్నాం. – బి.మహేశ్వరెడ్డి, జిల్లా సైన్స్‌ అధికారి, కడప

ఎమ్మెల్యేగా, మంత్రిగా
నియోజకవర్గానికి ఏం చేశావు?

డీఎల్‌కు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సూటి ప్రశ్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు మంత్రిగా ఉన్న డీఎల్‌ రవీంద్రారెడ్డి మైదుకూరు నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న డీఎల్‌కు మతిభ్రమించిందని ధ్వజమెత్తారు. ఆర్‌బీకేలపై మాజీ ఎమ్మెల్యే డీఎల్‌ రవీంద్రారెడ్డి చేసిన విమర్శలపై బుధవారం మైదుకూరులో వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల వల్ల రైతులకు ఎంత మేలు జరుగుతుందో అందరికీ తెలుసునని అన్నారు. డీఎల్‌ సొంత మండలం ఖాజీపేటకు పంటల బీమా కింద ఇప్పటికి రూ.31.76 కోట్లు రైతులకు అందిందన్నారు. ఆయన సొంత పంచాయతీ సుంకేసులలో రూ.10.85 కోట్లు పంటల బీమా వచ్చిందన్నారు. రైతు భరోసా కింద ఖాజీపేట మండలంలో రూ.43.72 కోట్లు రైతుల ఖాతాల్లో పడిందని, సుంకేసులకు రూ.6.55 కోట్లు అందిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖాజీపేట మండలంలో 1,657 టన్నుల ఎరువులను రైతులకు అందించినట్టు తెలిపారు. ప్రజల్లో తిరిగి ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని తెలుసుకోకుండా ఎవరు వెంచర్లు వేస్తున్నారు.. నాకేం రాకపోయనే అంటూ జిల్లా అంతా వెంపర్లాడటం తప్ప డీఎల్‌ ఏమి చేయడం లేదన్నారు. కడప టీడీపీ ఇన్‌చార్జిగా ఎవరినో నియమిస్తే దానిని విమర్శించిన డీఎల్‌ ముందు ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీలోనా.. టీడీపీలోనా.. ఏదో ఒక పార్టీ తరఫున పోటీ చేయాలి, లేదా 1978లోలాగా ఇండిపెండింటిగా పోటీ చేయాలన్నారు. తమ కుటుంబం 1967 నుంచి ప్రజలతోనే ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అప్పటి నుంచి శాసనసకు పోటీ చేస్తూనే ఉన్నామని, మరో 50 ఏళ్లు అయినా తమ కుటుంబం నుంచి పోటీ ఉంటుందని చెప్పారు. చంద్రబాబు అరెస్టు అన్యాయం, అక్రమం అని డీఎల్‌ అంటున్నాడని, చంద్రబాబును అరెస్టు చేసిన పద్ధతి సరైనది కాదని అంటున్నారే తప్ప అవినీతి జరగలేదని ఎవరూ చెప్పడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినందుకు చెప్పుతో కొట్టుకోవాలని అంటున్న డీఎల్‌ అసలు ఎవరికి ఓటు వేశారో చెప్పాలన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన ఆయన, 2019లో వైఎస్సార్‌సీపీలో ఉండీ టీడీపీకి ఓట్లు వేయమని పత్రికా ప్రకటన చేయలేదా అన్నారు. డబ్బు వసూళ్లు చేస్తున్నట్టు తనపై డీఎల్‌ ఆరోపణలు చేస్తున్నారని, 1978 నాటి ఆయన ఆస్తి ఎంతో, తన ఆస్తి ఎంతో అందరికీ తెలుసునని తెలిపారు. ఈ వయసులో డీఎల్‌ గౌరవంగా ఉండటం నేర్చుకోవాలని హితవు పలికారు. వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌బీకేలపై డీఎల్‌ రవీంద్రారెడ్డి అనుచిత వ్యాఖ్యలు శోచనీయమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు మండల కేంద్రంలో వ్యవసాయాధికారి మాత్రమే ఉండేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటిలో అగ్రికల్చర్‌, హార్టికల్చర్‌ సహాయకులను నియమించారని, వారి ద్వారా రైతులకు పంటల ఆగులో సలహాలు, సూచనలు ఇప్పిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీఐబీసీ డైరెక్టర్‌ డి.గంగాధర్‌ రెడ్డి ఖాజీపేట మండల ఉపాధ్యక్షుడు డి.చంద్రభాస్కర్‌రెడ్డి మాటాడారు. మైదుకూరు వైస్‌ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు లింగన్న పాల్గొన్నారు.

రిమ్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ సురేఖకు పదోన్నతి

కడప అర్బన్‌ : కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్‌) ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌ ఏ. సురేఖకు అడిషనల్‌ డీఎంఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం వైద్య ఆరోగ్యశాఖ విభాగం స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సురేఖకు వైస్‌ ప్రిన్సిపాల్స్‌ శ్రీనివాసనాయక్‌, వరలక్ష్మి, రిమ్స్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమాదేవి అభినందనలు తెలియజేశారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్‌ విజయరామరాజు


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎంపీపీ చీర్ల సురేష్‌ యాదవ్‌

చెన్నూరు : మండలంలో వివిధ కారణాల వల్ల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం, స్పందన'కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్‌ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్థానిక రెవిన్యూ కార్యాలయంలో కలెక్టర్‌ అధ్యక్షతన ఏర్పాటుచేసిన 'జగనన్నకు చెబుదాం.. స్పందన'కార్యక్రమానికి పెద్ద ఎత్తున మండల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే జిల్లా, మండల అధికారులతో మాట్లాడి వీటిని త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొంతమంది రైతులు కేసీ కెనాల్‌కు నీళ్లు ఇస్తే వరి పంట సాగు చేస్తామని తెలపడంతో, ఆయన స్పందిస్తూ, వర్షాభావం వల్ల వరి పంట వేసేందుకు డ్యాములలో నీటి మట్టం తక్కువగా ఉందని, అందువల్ల ప్రత్యామ్నాయ పంటలపై దష్టి సారించాలని తెలిపారు, అలాగే వ్యవసాయ అధికారులను పిలిచి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కనపర్తి జగనన్న లే అవుట్‌ లలో గ్రావెల్‌ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ఎంపీటీసీ రఘురాంరెడ్డి కలెక్టర్‌ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన త్వరలోనే పనులు చేపడతామని ఎంపీటీసీకి హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను కలెక్టర్‌ పరిశీలించి వీటిని వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. నేషనల్‌ హైవే సమస్యలపై ప్రజా ప్రతినిధులు, ఎంపీపీ చీర్ల సురేష్‌ యాదవ్‌, వైఎస్సార్‌సీపీ టౌన్‌ కన్వీనర్‌ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎర్ర సాని నిరంజన్‌ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామమూర్తి, ఎర్ర సాని మోహన్‌ రెడ్డి, సర్పంచ్‌ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు, కలెక్టర్‌ కు వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన కలెక్టర్‌ గురువారం కడపలో నేషనల్‌ హైవే ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని, మండల ప్రజా ప్రతినిధులు జాతీయ రహదారికి సంబంధించిన ఏయే సమస్యలు ఉన్నాయో గుర్తించి ఒక నివేదిక తయారు చేసుకుని తీసుకురావాలని తెలిపారు, అక్కడ నేషనల్‌ హైవే పీడీతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. 'జగనన్న కు చెబుదాం స్పందన'కార్యక్రమం ద్వారా చెన్నూరు మండల వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు 38 అర్జీలు ఇచ్చారని, కొన్నింటిని అక్కడే పరిష్కరించామని తెలిపారు, ఈ కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ గణేష్‌ కుమార్‌, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, స్పెషల్‌ కలెక్టర్‌ భరద్వాజ్‌, జడ్పీ సీఈఓ ఎం సుధాకర్‌ రెడ్డి, డి ఆర్‌ డి ఏ పి డి ఆనంద్‌ నాయక్‌, డ్వామా పిడి యదుభూషన్‌ రెడ్డి, డిపిఓ ప్రభాకర్‌ రెడ్డి, హౌసింగ్‌ పీడీ కృష్ణయ్య, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మల్లికార్జున రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక టూర్లు

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక టూర్లు నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్‌ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం డిపో మేనేజర్‌ శ్రీనివాసరావు, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌ హసీనా బేగం, డిపో ఎస్‌టీఐ మంజుల, ఎంఈఓ నరహరిశర్మ తదితరులు విడుదల చేశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ మైదుకూరు డిపో నుంచి కోరిన రోజుల్లో, శని, ఆదివారాల్లో కానీ ఈ ప్రత్యేక టూర్లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. టూర్ల ప్యాకేజీ వివరాలను ఆయన తెలిపారు. మైదుకూరు బస్టాండ్‌ నుంచి బస్సు ఉదయం 7 గంటలకు బయల్దేరి, దేవుని కడప, ఒంటిమిట్ట, నందలూరు సౌమ్య నాథాలయం, తాళ్లపాక క్షేత్రాలను దర్శించుకుని సాయంత్రం 6 గంటలకు తిరిగి మైదుకూరు చేరుకుంటుందన్నారు. మైదుకూరు బస్టాండ్‌ నుంచి ఉదయం 7 గంటలకు మరో బస్సు బయల్దేరి అల్లాడుపల్లె, సంగమేశ్వర దేవాలయం, వేంపల్లె గండి క్షేత్రం, దేవుని కడప క్షేత్రాలను దర్శించుకుని సాయంత్రం 6 గంటలకు మైదుకూరు చేరుకుంటుందన్నారు. ఇంకొక టూరులో మైదుకూరు బస్టాండ్‌ నుంచి ఉదయం 7 గంటలకు బయల్దేరి గండికోట, మైలవరం డ్యాం సందర్శించుకుని సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ టూర్లలో ఎక్స్‌ప్రెస్‌ బస్సుకు పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.300, సూపర్‌ లగ్జరీ బస్సు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 టికెట్‌ ఉంటుందని డీఎం వివరించారు. ఈ టూర్ల కోసం బస్సులను బుక్‌ చేసుకునేవారు 9959225781 (డీఎం), 9701145249 (మార్కెటింగ్‌) 7382865848 (టీఐ)లకు సంప్రదించాలని కోరారు.

గుంతను తప్పించబోయి..కిందపడి


రాజేష్‌ మృతదేహం

కొండాపురం : మండల పరిధిలోని పెంజి అనంతపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుంతను తప్పించబోయి స్కూటీ అదుపుతప్పి కింద పడిన ఆర్‌. రాజేష్‌(30) మృతి చెందాడు. కొండాపురం ఎస్‌ఐ యోగేంద్ర కథనం మేరకు చౌటిపల్లె గ్రామానికి చెందిన ఆర్‌. శ్రీరాములు కుమారుడు ఆర్‌ రాజేష్‌ తాడిపత్రి నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా పెంజి అనంతపురం ఎస్సీ కాలనీ వద్ద జాతీయ రహదారిలో గుంత తప్పించబోయి కింద పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. వెంటనే 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు

లారీని బైక్‌ ఢీకొని..

మండల పరిధిలోని ఏటూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యలటూరు హరికృష్ణ(27) మృతి చెందాడు. తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ మోహన్‌ కథనం మేరకు వైఎస్సార్‌ జిల్లా వీరపునాయునిపల్లె మండలం యు. రాజుపాలెం గ్రామానికిచెందిన యలటూరు హరికృష్ణ భారతి సిమెంట్‌ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్వగ్రామం నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గం కొత్తపల్లె గ్రామంలోని అత్తారింటికి బైక్‌లో బయలుదేరాడు. ఏటూరు గ్రామం వద్ద ముందు వెళుతున్న లారీ సడెన్‌గా ఆగింది. హరికృష్ణ వేగాన్ని అదుపుచేసుకోలేక లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆగి ఉన్న అదే లారీని మరో కారు ఢీకొంది. అయితే కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు నుజ్జునుజ్జు అయింది. ఈఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో బాలురు అరెస్ట్‌

– రూ. 3.50 లక్షలు నగదు, 17.7 గ్రాముల బంగారు చైన్‌ స్వాధీనం




అరెస్ట్‌ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఐ రాజారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆ ఇంట్లో దొంగతనం జరిగిన తీరు చూసి ఇది పక్కా ప్రొఫెషనల్‌ దొంగల పనేనని పోలీసులు భావించారు. ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే ఇంటికి కన్నం వేసింది ఇద్దరు మైనర్‌ బాలురు అని తెలియడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని గోకుల్‌నగర్‌లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు మైనర్‌ బాలలను పోలీసులు అరెస్ట్‌ చేశారు. హోటల్‌ నిర్వాహకుడు బైసాని సుబ్బరామయ్య ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నిందితులను నడింపల్లెలోని పాత సమితి కార్యాలయం సమీపంలో అరెస్ట్‌ చేశారు. వన్‌టౌన్‌ సీఐ రాజారెడ్డి, టూ టౌన్‌ ఎస్‌ఐ రెడ్డిసురేష్‌లు అరెస్ట్‌ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. గోకుల్‌నగర్‌లోనే గాక ఈ నెల 15న రాత్రి శ్రీరాములపేటలోని హోటల్‌లో కూడా వీరు చోరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ రెండు కేసులకు సంబంధించి వారి వద్ద నుంచి రూ.3. 50 లక్షల నగదు, 17.7 తులాల బంగాను చైన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి బాలల సంరక్షణా కేంద్రానికి తరలించనున్నట్లు సీఐ తెలిపారు. చోరీ కేసు ఛేదించిన వన్‌టౌన్‌ సీఐ రాజారెడ్డి, టూ టౌన్‌ ఎస్‌ఐ రెడ్డిసురేష్‌, సిబ్బందిని ఏఎస్పీ ప్రేరణాకుమార్‌ అభినందించారు.

పిల్లల నడవడికపై దృష్టి సారించండి

చోరీ కేసులో అరెస్ట్‌ అయిన బాలురు 16,13 ఏళ్ల లోపు వారే. పిల్లల ప్రవర్తన, ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారనే దానిపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఏఎస్పీ ప్రేరణాకుమార్‌ తెలిపారు.చిన్న వయసులోనే పిల్లలు పెద్ద పెద్ద నేరాలకు పాల్పడి వారి బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

రిమ్స్‌ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు

కడప అర్బన్‌ : కడప రిమ్స్‌ మార్చురీలో గుర్తు తెలియని మహిళల మృతదేహాలున్నాయి. వారి ఆచూకీ తెలిసిన వారు నేరుగా వచ్చి తమను సంప్రదించాలన్నారు. ఈ వివరాలను బుధవారం కడప ప్రభుత్వ వైద్యకళాశాల ఆర్‌ఎంఓ డాక్టర్‌ శ్రీనివాసులు తెలియజేశారు.

అమ్మో.. చిరుతలు

చక్రాయపేట : వైఎస్సార్‌ జిల్లా చక్రాయపేట మండలంలోని గడ్డంవారిపల్లె గ్రామం గొంది, మూలపల్లెల సమీపం లోని రామిరెడ్డి చెరువు ప్రాంతంలో చిరుత పులులు సంచరిస్తున్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులతో పాటు అటవీశాఖ అధికారులు కూడా ధృవీకరించారు. నాలుగు నుంచి ఐదు చిరుతలు సంచరిస్తున్నాయని, రెండు రోజుల క్రితం ఒక మేకను కూడా తీసుకెళ్లాయని గొర్రెల కాపరులు వాపోతున్నారు. అడవులు గ్రామానికి అత్యంత సమీపాన ఉన్నందున అవి ఎప్పుడైనా ఊళ్లపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా.. గొంది, మూలపల్లె వాసులు అప్రమత్తంగా ఉండాలని వేంపల్లె అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. అటవీశాఖ డీఆర్వో గుర్రప్ప తమ సిబ్బందితో కలసి రామిరెడ్డి చెరువు ప్రాంతం వద్దకు వెళ్లారు.అడవులు దట్టంగా ఉన్నందున పులులు ఉండే ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు.గొర్రెల కాపరులు అడవి లోపలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ రుణ విస్తరణ


లబ్ధిదారుడికి ఆటో తాళాన్ని అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ రుణ విస్తరణ కార్యక్రమం స్థానిక హరిత హోటల్‌ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఛైర్మన్‌ రాకేష్‌ కశ్యప్‌, నాబార్డ్‌ సిజిఎం ఎంఆర్‌ గోపాల్‌,నాబార్డ్‌ డీజీఎం రాజీవ్‌ కుమార్‌ శర్మ లు హాజరై మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ కడప జిల్లాలో 61 శాఖలతో 5240 కోట్లతో అధిక వ్యాపార వాటాతో కలిగి ఉందని తెలిపారు. రుణాలలో 2526 కోట్ల వ్యాపార లావా దేవీలు నిర్వహిస్తూ పంట రుణాలు ,స్వయం సహాయక బంద రుణాలు, వివిధ రకాల వ్యాపార రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రీజినల్‌ మేనేజర్‌ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్‌ సాధించిన అభివద్ధి, లభించే సేవలను రుణ సదుపాయాల గురించి ఖాతాదారులకు తెలియజేశారు. దాదాపు 160 మంది ఖాతాదారులకు గృహ వాహన వ్యాపార, వ్యవసాయ తర రుణాలు 5 కోట్ల 20 లక్ష లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప రీజినల్‌ శాఖ బ్రాంచ్‌ మేనేజర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు శ్రేయోభిలాషులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారన్నారు.

లేగదూడలను సంరక్షించాలి

పోరుమామిళ్ల : మేలు జాతి లేగదూడల పెంపకం వల్ల రైతులకు సిరులు కురుస్తాయని పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌ మాధవరెడ్డి పేర్కొన్నారు.వీటిని సంరక్షించాలని ఆయన చెప్పారు. బుధవారం టేకూరుపేట పశువైద్యశాల పరిధిలోని చిన్నయరసాలలో సహాయ సంచాలకులు డాక్టర్‌ చంద్రశేఖర్‌ ఆధ్వర్యంలో మేలు జాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో 40 మంది రైతులకు చెందిన 53 దూడలు పాల్గొన్నాయి. ప్రదర్శనలో పాల్గొన్న అన్ని దూడలకు బహుమతులు వాటి యజమానులకు అందచేశారు. కడప డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రమేష్‌, ఉపసంచాలకులు రమణయ్య, సహాయ సంచాలకులు శ్రీనివాసులరెడ్డి, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల పశువైద్యులు శివ శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గోపవరం : మండలంలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా కలెక్టర్‌, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, ఏఓ అరవిందనాయక్‌ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సాయిక్రిష్ణ ట్రేడర్స్‌లో ఎరువుల స్టాకుకు సంబంధించి ఈ-పాస్‌ మిషన్‌లో నమోదు కాని 150 బస్తాల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వం ప్రతి బస్తాపై సబ్సిడీ ఆయా కంపెనీలకు ఇస్తున్నందున ఆన్‌లైన్‌లో ఉండే స్టాకుకు, దుకాణంలో నిల్వ ఉన్న స్టాకు వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. కంపెనీల వారీగా ఎరువుల వివరాలను స్టాకు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాలన్నారు. రైతుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు.